క్లుప్తంగా

ఈ నెల 9 నుంచి 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం

కేవీపల్లె : ఈ నెల 9వ తేదీ నుంచి మండలంలో ×ఆంధ్రప్రదేశ్‌కి జగనన్నే ఎందుకు కావాలంటే× కార్యక్రమం నిర్వహించనున్నట్లు గ్రామ సచివాలయాల మండల కన్వీనర్ పొత్తపు సతీష్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 9న నూతనకాల్వ, 10న తీతవగుంటపల్లె, 14న మారేళ్ల, 15న మద్దిపట్లవారిపల్లె, 16న కేవీపల్లె -2, 17న కేవీపల్లె-1, 20న జిల్లేళ్లమంద, 21న గ్యారంపల్లె, 22న గర్నిమిట్ట, 23న సొరకాయలపేటలో రాష్ట్రానికి జగనన్నే ఎందుకు కావాలంటే కార్యక్రమం జరుగుతుందని చెప్పారు.

23న రామేశ్వరానికి ప్రత్యేక బస్సుసర్వీసు

పీలేరు రూరల్ : కార్తీక మాసం పురస్కరించుకుని ఈ నెల 23న పీలేరు నుంచి రామేశ్వరానికి ప్రత్యేక బస్సుసర్వీసు నడుపనున్నట్లు డిపో మేనేజర్ బి. కుమార్ తెలిపారు. 40 సీట్ల సామర్థ్యం గల ఆల్ట్రా డీలక్స్ బస్సు పీలేరులో బయలుదేరి రామేశ్వరం, తిరుచందూర్, శ్రీరంగం, సమయపురం, తంజావూరు, చిదంబరం, తిరునల్లార్, వైదీవ్వరన్, స్వామిమలై, కుంభకోణం తోపాటు చివరగా 26న అరుణాచలం గిరిప్రదిక్షణ చూసుకుని తిరిగి పీలేరు చేరుకుంటుందని తెలిపారు. వివరాలకు మార్కెంటింగ్ టీమ్ రమణ 7893152748 ను సంప్రదించాలని కోరారు.

జేఎన్‌టీయూ చెస్ పోటీలకు మిట్స్ విద్యార్థి ఎంపిక


పోటీలకు ఎంపికైన మణికంఠేశ్వర్‌రెడ్డి

కురబలకోట: అనంతపురం జేఎన్‌టీయూ చదరంగం జట్టుకుకు అంగళ్లలోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాల ఈసీఈ విద్యార్థి ఎస్.మణికంఠేశ్వర్ రెడ్డి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ యువరాజ్ తెలిపారు. కావలిలోని రామిరెడ్డి సుబ్బరామిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన చదరంగం పోటీల్లో ప్రతిభ కనపరచటంతో యూనివర్సిటీ టీమ్‌కు ఎంపికై నట్లు తెలిపారు. తమిళనాడులోని భారతిదాస్ యూనివర్శిటీలో ఇంటర్ యూనివర్సిటీ పోటీలలో ఇతను పాల్గొంటారని తెలిపారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌కు కన్నెమడుగు విద్యార్థిని


రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన స్ఫూర్తి

తంబళ్లపల్లె: స్కూల గేమ్స్ ఫేడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అథ్లెటిక్స్ పోటీలలో కన్నెమడుగు విద్యార్థిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం మదన్మోహన్, పీడీ ఖాదర్‌బాషా తెలిపారు. శనివారం తిరుపతిలో జరిగిన అథ్లెటిక్స్‌లో 9వ తరగతి విద్యార్థిని స్ఫూర్తి ట్రిపుల్ జంప్‌లో ప్రతిభచాటి ద్వితీయస్థానం దక్కించుకుని రాష్ట్రస్థాయికి ఎంపికై ందన్నారు. గుంటూరు జిల్లా పల్నాడులో జరిగే రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌లో పాల్గొంటుందన్నారు. బాలికను ఎంఈవోలు త్యాగరాజు, నాగసుబ్బరాయుడు ఉపాధ్యాయులు అభినందించారు.

నేడు గడప గడపకూ మన ప్రభుత్వం

వాల్మీకిపురం: వాల్మీకిపురం పంచాయతీలోని ఫత్తేపురం, శివపురం, నల్లంవారిపల్లి, ఓబులంపల్లి గ్రామాల్లో సోమవారం ఉదయం 6గంటల నుంచి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు మండల పార్టీ అధ్యక్ష్యులు నీళ్లభాస్కర్, ఉప సర్పంచ్ కేశవ రెడ్డి తెలిపారు. ఇందులో భాగంగా పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి ఇంటింటికి వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకొని, పరిష్కార సమస్యలను అక్కడికక్కడే పరిష్కరిస్తారని తెలిపారు. ప్రజలు తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి అర్జీల రూపంపలో తీసుకువచ్చి పరిష్కరించుకోవచ్చన్నారు. మండల స్థాయి అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు హాజరుకావాలని వారు కోరారు.

వడ్డెర చైతన్య సభను జయప్రదం చేయండి


కరపత్రాలు పంపిణీ చేస్తున్న వడ్డెర సంఘం నాయకులు

కలకడ : నియోజకవర్గంలోని ఆరు మండలాలోని వడ్డెర కులస్తులు, బీసీ వర్గాలు అధిక సంఖ్యలో పాల్గొని వడ్డెర చైతన్య సభను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు బత్తుల యల్లయ్య, ఉపాధ్యక్షుడు వెంకట్రమణ కోరారు. ఆదివారం మండలంలోని నడిమిచెర్ల, బాలయ్యగారిపల్లె, గంగాపురం, కె.బాటవారిపల్లె, కదిరాయచెర్వు పంచాయతీలలోని వడ్డిపల్లెల్లో పర్యటించారు. 8వతేదీ పీలేరు మార్కెట్ యార్డు ఆవరణంలో నిర్వహించనున్న వడ్డెర చైతన్య సభను విజయవంతం చేయాలని ఇంటింటికీ కరపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో రెడ్డిశేఖర్, మండల స్థాయి నాయకులు పాల్గొన్నారు.

ఓటు హక్కు నమోదు చేసుకోండి

- వచ్చే నెల 9 వరకు అవకాశం
- మార్పులు, చేర్పులూ చేసుకోవచ్చు
- తహసీల్దార్ పర్యవేక్షణలో గ్రామాల్లో ఓటర్ల జాబితా ప్రదర్శన


చెన్నరాయునిపల్లిలో ఓటర్ల జాబితా పరిశీలిస్తున్న తహసీల్దార్ విద్యాసాగర్

పెద్దతిప్పసముద్రం: ప్రజా స్వామ్యానికి మూల స్తంభం ఎన్నికలు. నిజాయితీ, సమర్థత గల నాయకుడిని ఎన్నుకునేందుకు ఓటు వజ్రాయుధం లాంటిది. అటువంటి ఎన్నికల ప్రక్రియలో ఓటుకు అత్యధిక ప్రాధాన్యత ఉంటుంది. దీనిని దృష్టిలో పెట్టుకుని ఎన్నికల కమిషన్ ప్రతి ఏటా ఓటర్ల జాబితాలో సవరణ చేస్తుంటుంది. ఇందులో భాగంగానే మరోసారి సవరణ ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. భారత ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం 18 ఏళ్ళు నిండిన యువతీ, యువకులందరూ కొత్తగా ఓటు హక్కు నమోదుకు మరోసారి అవకాశం కల్పించింది. వచ్చే నెల 9 వరకు కొత్తగా ఓటు హక్కును ఆయా గ్రామాల బీఎల్వోలు, ఆన్‌లైన్ యాప్ ద్వారా నమోదు చేసుకోవచ్చు. అదే విధంగా ఒక పోలింగ్ కేంద్రం నుంచి మరో పోలింగ్ కేంద్రంకు నివాసం మారిన వారు ఓటరు కార్డులో మార్పులు, ఇతర ప్రాంతాల్లో ఉన్నవారు సైతం పాత కార్డును రద్దు చేసుకుని కొత్త కార్డు కొత్త కార్డు కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే వెసులుబాటు కూడా కల్పించింది. కొత్త ఓటరు నమోదుకు ఫారం -6, జాబితాలో మార్పులకు ఫారం-7, పోలింగ్ బూతులో మార్పుల కోసం ఫారం-8 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. కావాల్సిన దరఖాస్తు పత్రాన్ని ఎంచుకుని వివరాలు నమోదు చేసుకోవాలి. చిరునామా, పుట్టిన తేదీ, కుటుంబ సభ్యుల వివరాలు, బంధం, తదితర వాటిని నమోదు చేయాల్సి ఉంటుంది. అనంతరం బీఎల్వో సదరు దరఖాస్తుదారుని నివాసానికి వెళ్ళి విచారణ చేసి నివేదికను అందజేస్తారు. ప్రత్యేక ఓటరు దినోత్సవం ప్రక్రియలో భాగంగా తహసీల్దార్ విద్యాసాగర్ ఆదివారం పలు పోలింగ్ కేంద్రాలను పరిశీలించి ఓటర్ల జాబితా ప్రదర్శించి అభ్యంతరాలపై ఓటర్ల నుంచి ఆరా తీశారు.

అవకాశం సద్వినియోగం చేసుకోవాలి

ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఓటు హక్కు నమోదు, మార్పులు, చేర్పులు, తప్పుల సవరణకు అవకాశం కల్పించింది. ప్రత్యేక ఓటర్ల నమోదుకు యువతకు అవగాహన అవసరం. 18 ఏళ్ళు నిండి ఓటు లేని అర్హులందరూ ధ్రువీకరణ పత్రాల ఆధారంగా అందుబాటులో ఉన్న బీఎల్వోలను సంప్రదించి దరఖాస్తు చేసుకోవచ్చు. ఓటు నమోదు కార్యక్రమాన్ని అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలి.

-విద్యాసాగర్, తహసీల్దార్, పెద్దతిప్పసముద్రం

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు సముచిత స్థానం


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నేతలు

కలికిరి: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటైన తరువాతే ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీలకు సముచిత స్థానం లభించిందని వైఎస్సార్‌సీపీ మైనార్టీ, బీసీ, ఎస్సీ నేతలు అన్నారు. వైఎస్సార్‌సీపీ చేపట్టిన సామాజిక సాధికారత బస్సు యాత్రకు వస్తున్న ప్రజాదరణను చూసి ఓర్వలేని స్థానిక టీడీపీ నేతలు అసత్య ప్రచారాలు చేస్తుండటంపై నేతలు ఆదివారం విలేకరులతో మాట్లాడారు. టీడీపీ హయాంలో దళితులుగా ఎవరు పుట్టాలనుకుంటారని, దళితులకు రాజకీయాలు అవసరం లేదన్న టీడీపీ నాయకుల వ్యాఖ్యలను ప్రజలు ఎప్పటికీ మరువరని గుర్తుచేశారు. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీలు రాజకీయంగా, ఆర్థికంగా అభివృద్ధి సాధించారన్నారు. సీఎం జగన్ మోహన్ రెడ్డి బీసీలను వెనుకబడిన కులాలుగా కాకుండా బ్యాక్ బోన్ కులాలుగా గుర్తించారన్నారు. సామాజిక సాధికారిత బస్సు యాత్రపై విమర్శలు చేస్తున్న టీడీపీ నేతలు ఒక్కసారి ఆత్మ విమర్శచేసుకోవాలని హితవులు పలికారు. మరోసారి అనుచిత విమర్శలు చేస్తే తగిన మూల్యం చెల్లించాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో మైనార్టీ నాయకుడు ఎంబి హనీఫ్, ఎంపీటీసీ సభ్యుడు భోగేష్, నాయకులు మల్లికార్జున, ఖాదర్ బాషా, నరేష్, విశ్వనాధ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీని విమర్శించే అర్హత లేదు...

నియోజకవర్గంలో టీడీపీ నాయకులకు వైఎస్సార్‌సీపీని విమర్శించే అర్హతే లేదని వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్టీడి హరి అన్నారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, రాజంపేట ఎంపీ పీవీ మిథున్ రెడ్డి నిత్యం ప్రజల్లో ఉండి ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తున్నారని, వచ్చే ఎన్నికలలో సైతం ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీలు వైఎస్సార్‌సీపీ వెంటే నిలబడతారన్నారు. టీడీపీ గతంలో ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీలను చిన్నచూసిన విషయాన్ని ప్రజలు మరువరన్నారు.

ఘనంగా వాల్మీకి మహర్షి జయంతి


వాల్మీకి విగ్రహానికి అభిషేకం చేస్తున్న దృశ్యం

రామసముద్రం: రామసముద్రం మండల కేంద్రంలో ఆదివారం వాల్మీకి మహర్షి జయంతిని వైభవంగా నిర్వహించారు. మండల వాల్మీకి సంఘం అధ్యక్షుడు , మాజీ ఎంపీటీసీ దొడ్డిపల్లి ఆనంద, వాల్మీకి సోదరుల ఆధ్వర్యంలో చెంబకూరు రోడ్డులో ఉన్న వాల్మీకి విగ్రహానికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేసి జైవాల్మీకి అంటు నినాలు చేశారు. కర్ణాటక రాష్ట్రం నుంచి ప్రత్యేక రథం తెప్పించి వాల్మీకి విగ్రహాన్ని రామసముద్రం పురవీధుల్లో అత్యంత వైభవంగా బళ్లారి డ్రమ్ములు, కోలాటంలు , చెక్కభజనలు నడుమ ఊరేగించారు. ప్రతి ఒక్కరు వాల్మీకి అడుగుజాడల్లో నడవాలని ఆకాంక్షించారు. ఈ ఉత్సవానికి మండల వాల్మీకి సోదరులే కాకుండ కర్ణాటక నుంచి కూడా వాల్మీకులు తరలివచ్చారు. అలాగే వచ్చిన వారందరికి అన్నదానం నిర్వహించారు. అలాగే బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వాల్మీకి ధర్మ సమాజ్‌రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు టేకుపల్లి శ్రీనివాసులు, జెడ్పీటీసీ రామచంద్రారెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు కేశవరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు భాస్కర్‌గౌడు, కొండూరు కృష్ణారెడ్డి, మండల కన్వీనర్ నంద, ప్రకాష్, కత్తి వాలెప్ప, ఆర్‌బికె చైర్మన్ కృష్ణమూర్తి, రాజన్న , కేశవ, బసప్ప, ఈశ్వర తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకి ధర్మసమాజ్ యువజన అధ్యక్షుడిగా శ్రీనివాసులు

రాష్ట్ర వాల్మీకి ధర్మసమాజ్ యువజన అధ్యక్షుడిగా టేకుపల్లి శ్రీనివాసులుని నియమిస్తూ దిల్భాగ్ ఆదివాసి జాతీయ వాల్మీకి సంఘం అధ్యక్షులు , అలాగే దక్షిణాది రాష్ట్రాల అధ్యక్షులు గంపలగంగరాజు ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా వాల్మీకి విగ్రహానికి పూలమాలలు వేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వాల్మీకులందరు కలసి కట్టుగా ఐకమత్యంతో ఎస్టీ సాధించుకోవాలన్నారు. గత 15 సంవత్సరాలుగా రాష్ట్ర కుల సంఘాల్లో పని చేశానని, ఎంతో నమ్మకంతో ఈ పదవి ఇవ్వడంపై జాతి కోసం శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించండి

వాల్మీకిపురం: ప్రతి ఒక్క వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని వాల్మీకిపురం సీఐ సురేష్ అన్నారు. ఆదివారం మండలంలోని పలు ప్రాంతాల్లో రోడ్డు భద్రత బోర్డులను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ లైసెన్సు కలిగి ఉండాలని, వాహనాల రికార్డులను తమ వెంట ఉంచుకోవాలన్నారు. ద్విచక్ర వాహనదారులు తలకు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. అనంతరం మండల వ్యాప్తంగా జాతీయ రహదారికి ఇరువైపులా రోడ్డు భద్రత బోర్డులను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎస్ఐలు నాగేశ్వరరావు, క్రిష్ణమూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

రేకులకుంటకు తారు రోడ్డు


పూజా కార్యక్రమంలో నాయకులు, గ్రామస్తులు

తంబళ్లపల్లె: మండలంలోని కుక్కరాజుపల్లె పంచాయతీ రేకులకుంటకు స్వాతంత్ర్య వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు రోడ్డు లేక గ్రామస్తులు ఇబ్బందులు పడ్డారు. దశాబ్దాల వారి కల కల్లగానే మిగిలాయి. ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి ఆ గ్రామానికి వెళ్లినప్పుడు రోడ్డు సౌకర్యం కల్పించాలని కోరారు. కోటకొండ రోడ్డు నుంచి రేకలకుంటకు మూడు కిలోమీటర్లకు రూ.2.19 కోట్ల నిధులు మంజూరు చేయించారు. సింగిల్‌విండో చైర్మన్ భార్గవ్‌రెడ్డి భూమిపూజతో పనులు ప్రారంభించారు. గ్రామస్తులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

పరిమళించిన మానవత్వం

అనాథ మహిళకు అంత్యక్రియలు


అనాథ మహిళ శవాన్ని శ్మశానానికి తీసుకెళుతున్న ముస్లింలు

కురబలకోట: ఆమె ఎవరో..ఎక్కడి నుంచి వచ్చిందో తెలియదు. మతిస్థిమితం లేక మృతి చెందిన అనాథకు ముస్లిం సోదరులు ఆదివారం అంత్యక్రియలు నిర్వహించి మానవత్వం చాటుకున్నారు. వివరాలలోకి వెళితే...కురబలకోట మండలం అంగళ్లులో ఓ అనాథ మహిళ (40) రెండేళ్లుగా రోడ్డు పక్కన పిచ్చిదానిలా కాలం గడిపింది. ఎవరన్నా ఇంత పెడితే తిని రాత్రి వేళల్లో రోడ్డు పక్కన విశ్రమించేది. ఎండ వాన చలికి ఇబ్బందులు పడినా ఎవ్వరినీ ఆశ్రయించేది కాదు. చింపిరి జుట్టు..మాసిన దుస్తులతో పగలంతా రోడ్ల పక్కన కన్పించేది. ఆమెది ఏఊరో..ఎక్కడి నుంచి వచ్చిందో తెలీదు. ఇటీవల ఆమె అస్వస్థతకు గురైంది. స్థానిక ఎస్‌బీఐ బ్యాంకు ముందు షెడ్డులో కదలలేని స్థితిలో పడిపోయింది. శనివారం రాత్రి ఆమె చనిపోయింది. ఈమె పేరు షబనా అని కొందరు గుర్తించారు. కన్నడ, ఉర్దూ మాట్లాడుతుండడంతో ఈమెది కర్ణాటక ప్రాంతంగా భావించారు. దీంతో స్థానిక జామియా మసీదు ముస్లిం సోదరులు ముందుకు వచ్చి అన్నీ తామై ఆమెకు అంత్యక్రియలు నిర్వహించారు. వీరి పెద్ద మనసుకు సలామ్ అంటూ పలువురు ప్రశంసిస్తున్నారు. ఇలాంటి దిక్కులేని వారికి సేవ చేస్తే అల్లా మా కుటుంబాలకు మంచి చేస్తాడని వారు పేర్కొన్నారు. స్థానిక జామియా మసీదు కమిటీ ముస్లిం శ్మశాన వాటికలో ఆఖరి మజిలీ కార్యక్రమాలు నిర్వహించారు.

ఉచిత మెగా వైద్యశిబిరం


చికిత్స అందిస్తున్న వైద్యులు సుస్మిత, కొండారెడ్డి

రామసముద్రం: రామసముద్రం ఎంపీడీఓ కార్యాలయం ఆవరణంలో ఆదివారం తిరుపతి రమాదేవి మల్టీసూపర్‌స్పెషాలిటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరానికి హాజరైన వైద్యాధికారులు సుస్మిత, కొండారెడ్డిలు రోగులకు చికిత్స అందించి సలహాలు , సూచనలు ఇచ్చారు. శిబిరానికి 80 మంది రోగులు హాజరు కాగా 15 మందిని ఉచిత ఆపరేషన్లకు ఆరోగ్యశ్రీ క్రింద ఎంపిక చేసినట్లు తెలిపారు. ప్రజలు ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విద్యారంగ పరిరక్షణ కోసం జీపుజాత


మాట్లాడుతున్న ఆర్ఎస్‌యూ నాయకులు

మదనపల్లె : విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని రెవల్యూషనరీ స్టూడెంట్స్ యూనియన్(ఆర్ఎస్‌యూ) ఆధ్వర్యంలో వైఎస్సార్ కడప, అన్నమయ్యజిల్లా వ్యాప్తంగా జీపుజాత కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర అధ్యక్షుడు రవిశంకర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం మదనపల్లె నక్కలదిన్నె ప్రభుత్వ హాస్టల్ ప్రాంగణంలో జీపుజాతా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రవిశంకర్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలోని సంక్షేమ హాస్టళ్లలో చదువుతున్న విద్యార్థులు సమస్యలతో సతమతమవుతున్నారన్నారు. ర్యెగులర్ వార్డెన్స్ లేకపోవడంతో పర్యవేక్షణ కరువై విద్యార్థులు ప్రమాదాలబారిన పడుతున్నారన్నారు. హాస్టల్ విద్యార్థులకు సకాలంలో మెస్, కాస్మోటిక్‌ఛార్జీలు విడుదల చేయకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగాహైస్కూల్ హాస్టల్ విద్యార్థులకు నెలకు రూ.3,000, కాలేజీ విద్యార్థులకు రూ.4,000 మెస్‌ఛార్జీలు, బాలురకు నెలకు రూ.500, బాలికలకు రూ.600 కాస్మోటిక్ ఛార్జీలు పెంచాలన్నారు. కేజీబీవీలో ప్రారంభమైన ఇంటర్ కోర్సులకు అధ్యాపకులను నియమించలేదన్నారు. శాశ్వత ప్రాతిపదికన లెక్చరర్ పోస్టులు భర్తీ చేయకుండా గెస్ట్‌లెక్చరర్స్‌తో కాలం వెళ్లబుస్తున్నారన్నారు. ఇంటర్మీడియట్‌కు సంబంధించి అన్నమయ్య, కడప జిల్లాలో ఆర్‌జేడీ, ఆర్ఐఓలు ఇన్‌చార్జిలు కావడంతో కళాశాలపై పర్యవేక్షణ లోపించిందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు ప్రశాంత్, జీపుజాత బృందం హరి, శివ, మహేష్, వీరాంజనేయులు, వంశీ, రాష్ట్ర కమిటీ సభ్యులు చరణ్ తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగుల సంక్షేమానికి కృషి

కలికిరి: విశ్రాంత ఉద్యోగుల సంక్షేమానికి పెన్షనర్ల సంఘం తరపున కృషి చేయనున్నట్లు ఆ సంఘం నేతలు సురేంద్రరెడ్డి, వేంపల్లి అబ్దుల్ ఖాదర్ తెలిపారు. ఆదివారం స్థానిక ఎంఆర్‌సీ కార్యాలయ ఆవరణలో సంఘం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విశ్రాంత ఉద్యోగులకు వచ్చే నెలలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు తెలిపారు. విశ్రాంత ఉద్యోగులు ప్రజా సంక్షేమానికి సహాయపడాలని కోరారు. ఆ సంఘం నేతలు ఆదినారయణరెడ్డి, క్రిష్టారెడ్డి, సత్యనారాయణరావు, జయరాం, కాంతమ్మ, సరోజమ్మ, రామచంద్రయ్య పాల్గొన్నారు.

స్పెషల్ క్యాంపెయిన్‌లో 1,063 దరఖాస్తులు


మాట్లాడుతున్న ఆర్డీఓ మురళి

మదనపల్లె : కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు మదనపల్లె అసెంబ్లీ నియోజకవర్గం -164కు సంబంధించి, ముసాయిదా ఓటర్ల జాబితాపై అభ్యంతరాల స్వీకరణ, కొత్త ఓటర్ల నమోదుకు సంబంధించి శని, ఆదివారాల్లో నిర్వహించిన స్పెషల్ క్యాంపెయిన్ డేలో 1,063 దరఖాస్తులు అందాయని ఆర్డీఓ ఎం.ఎస్.మురళి తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ...నియోజకవర్గంలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో రెండురోజుల పాటు బీఎల్‌ఓలు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అందుబాటులో ఉండి, ప్రజల నుంచి అభ్యంతరాలు స్వీకరించారన్నారు. అలాగే వివిధ రాజకీయపార్టీల బూత్ లెవల్ ఏజెంట్లతో కలిసి ముసాయిదా జాబితా పరిశీలనలో పాల్గొన్నారన్నారు. రెండురోజుల పాటు జరిగిన స్పెషల్ క్యాంపెయిన్ డేలో 18 ఏళ్లు నిండిన వారు ఓటుకోసం ఫాం-6 కింద 633, ఓటర్ల జాబితా నుంచి అనర్హుల ఓట్లు తొలగించడానికి ఫాం-7 కింద 137, ఓటును వేరే పోలింగ్ బూత్‌కి మార్చేందుకు ఫాం-8 కింద 293, మొత్తం కలిపి 1,063 దరఖాస్తులు అందాయన్నారు. స్పెషల్ క్యాంపెయిన్ డేలో.. బీజేపీ సీపీఐ, సీపీఎం, టీడీపీ, వైఎస్సార్ సీపీ బూత్ లెవెల్ ఏజెంట్లు పోలింగ్ కేంద్రాల్లో పాల్గొన్నారన్నారు. ముసాయిదా ఓటరు జాబితాకు సంబంధించి ప్రజలకు, రాజకీయపార్టీల ప్రతినిధులకు ఏవేని అభ్యంతరాలు ఉంటే సంబంధిత పోలింగ్ కేంద్రం బీఎల్‌వోకు లేదా ఓటరు హెల్ప్‌లైన్ యాప్‌లో, ఎన్నికలసంఘం వెబ్‌సైట్లో ఫిర్యాదు చేయవచ్చన్నారు.

హార్సిలీహిల్స్‌పై ఓటర్లు 95

బి.కొత్తకోట: మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌పై 95 మంది ఓటర్లు ఉన్నట్టు రెవెన్యూ అధికారులు జాబితాను రూపొందించారు. ఈ జాబితాతో ఆదివారం కోటావూరు వీఆర్‌ఓ, బీఎల్‌ఓ నరేంద్ర ఓటర్లను కలిసి చూపించారు. స్థానికుల ఓటర్లు ఉన్నాయా లేవా అని సరిచూసుకునే చర్యలో భాగంగా జాబితాను పరిశీలించుకున్నారు. కాగా తంబళ్లపల్లె నియోజకవర్గంలో అత్యల్ప ఓటర్లు కలిగిన పోలింగ్ కేంద్రంగా హార్సిలీహిల్స్ ఘనత దక్కించుకుంది. కొండపై యోగా సెంటర్‌ను 200వ పోలింగ్ కేంద్రంగా తీర్చిదిద్దారు. పాత పోలింగ్ కేంద్రమైన ప్రాథమిక పాఠశాల భవనాన్ని రెవెన్యూ అతిథిగృహంలో కలిపేసి నిర్మాణం చేపట్టారు.

ఓటరు మార్పులు, చేర్పులకు 45 దరఖాస్తులు

కలికిరి: మండలంలోని పోలింగ్ బూత్‌లలో రెండు రోజుల పాటు నిర్వహించిన ప్రత్యేక క్యాంపులలో ఓటరు నమోదు, మార్పులు, చేర్పులు, తొలగింపులకు సంబంధించి మొత్తం 45 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దారు భాగ్యలత తెలిపారు. వీటిలో తొలగింపు-4, కొత్త ఓటరు నమోదు-31, మార్పులు-10 దరఖాస్తులు ఉన్నట్లు ఆమె తెలిపారు. కలికిరి పరిధిలోని 194, 196, 197 పోలింగ్ బూత్‌లను ఆదివారం నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి గోపాలకృష్ణ తనిఖీ చేశారు.

దాతల సహకారం అభినందనీయం

- సాయినారాయణ సేవా ట్రస్టుకు రూ. 2.50 లక్షలు వితరణ
- ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి


సాయినారాయణసేవ ట్రస్టుకు చెక్కును ఎమ్మెల్యే చింతలకు అందజేస్తున్న దాత

వాల్మీకిపురం: సేవా కార్యక్రమాలకు దాతల సహకారం అందించడం అభినందనీయమని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. ఆదివారం కలికిరి మండలం కొత్తపల్లికి చెందిన సాకిరి గిరిబాబు స్థానిక సాయి నారాయణ సేవా ట్రస్టు ఆధ్వర్యంలో నిర్మిస్తున్న అన్నదానానికి రూ.2.50 లక్షలు చెక్కును ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి చేతులమీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింతల మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ నిరుపేదలను ఆదుకోవడం ఆత్మ సంతృప్తి కలుగుతుందన్నారు. శ్రీ షిరిడిసాయి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అనేక రకాలైన ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలు చాలా బాగున్నాయని గిరిబాబు కొనియాడారు.

ప్రజారక్షణభేరి సభను జయప్రదం చేయండి

– సీపీఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు


ప్రజారక్షణభేరి పోస్టర్స్ ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

మదనపల్లె : ప్రజారక్షణభేరి సభను జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు పిలుపునిచ్చారు. నవంబర్ 15న విజయవాడలో జరగనున్న ప్రజారక్షణభేరి బహిరంగసభను జయప్రదం చేయాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో ఆదివారం ప్రజారక్షణభేరి ప్రచార పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి మద్దతిస్తూ వైఎస్సార్ సీపీ, టీడీపీ, జనసేనలు రాష్ట్రంలో ప్రజావ్యతిరేక రాజకీయాలు చేస్తున్నాయన్నారు. కేంద్రప్రభుత్వం అమలుచేస్తున్న ప్రజా,దళిత, గిరిజన వ్యతిరేక రాజకీయాలను రాష్ట్రంలోని అన్ని రాజకీయపార్టీలు బలపరుస్తున్నాయన్నారు. వాటిని ప్రజలకు వివరించేందుకు రాష్ట్రవ్యాప్తంగా ప్రజారక్షణయాత్ర సీపీఎం నిర్వహిస్తోందన్నారు. ఇందులో భాగంగా ఈనెల 15న విజయవాడలో బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రాల హక్కులను హరించే కేంద్రంలోని బీజేపీ చర్యలను ఏమాత్రం ప్రతిఘటించకుండా రాజకీయపార్టీలు చోద్యం చూస్తున్నాయన్నారు. బీజేపీతో పాటుగా దానికి మద్దతిస్తున్న అన్ని రాజకీయపార్టీలను నిలువరించేందుకే ప్రజారక్షణభేరి నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సభకు పెద్దసంఖ్యలో ప్రజలు హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు ఎ.రామాంజులు, నాయకులు హరిశర్మ, ప్రభాకరరెడ్డి, వెంకట్రామయ్య, సోమశేఖర్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగులు ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి


క్యాష్ అవార్డు అందజేస్తున్న సీనియర్ మెడికల్ ఆఫీసర్ శ్రీకాంత్

మదనపల్లె సిటీ: ఉద్యోగులు ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని ఆర్టీసీ కడప హాస్పిటల్ సీనియర్ మెడికల్ ఆఫీసర్ శ్రీకాంత్ అన్నారు. ఆదివారం స్థానిక ఆర్టీసీ-2 డిపో కార్యాలయంలో ఆదర్శ ఉద్యోగుల అభినందన సభ ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ ఆరోగ్యం బాగుంటేనే ఉద్యోగం చేయగలుగుతామన్నారు. ఇందుకు తరచూ వైద్య పరీక్షలు చేసుకోవాలని సూచించారు. బెస్టు కెఎంపిఎల్ సాధించిన డ్రైవర్లు ఆర్ఎల్ రెడ్డి, వి.రెడ్డప్ప, బెస్టు మెకానిక్‌లు బావాజాన్, బెస్టు అసిస్టెంట్ మెకానిక్ ఫోర్‌మెన్ ఎ.ఎస్.మణ్యం, బెస్టు ఏడీసీగా ఎఆర్ మోహన్, ఉత్తమ సిబ్బందిగా ఎస్.ఎస్.బాషా, ఆశ, హుస్సేన్,గోపాల్, యుగంధర్, వై.ఎస్.ఎస్.రెడ్డిలకు క్యాష్ అవార్డులు అందజేశారు. కార్యక్రమంలో డీఎం ఆర్‌సీ నిరంజన్, సీఐ గీత, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై మహాధర్నా


ఐక్యత చాటుతున్న వామపక్ష నాయకులు, కార్మిక, కర్షక సంఘాల నాయకులు

మదనపల్లె : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ కర్షక, కార్మిక, సామాన్య ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా నవంబర్ 27, 28 తేదీల్లో విజయవాడలో నిర్వహిస్తున్న మహాధర్నాను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు నాగసుబ్బారెడ్డి, సీఐటీయూ రాష్ట్రనాయకులు ఓబులు, ఏపీ రైతు సంఘం రాష్ట్ర నాయకులు కాటమయ్య కోరారు. ఆదివారం మదనపల్లె ఎస్టీయూ కార్యాలయంలో కార్మిక, రైతుసంఘాల ఆధ్వర్యంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ అధ్యక్షతన జిల్లా సదస్సు జరిగింది. ఈ సందర్భంగావారు మాట్లాడుతూ.. రానున్న రోజుల్లో అప్రజాస్వామ్యిక, అవినీతికర, ఫాసిస్టు బీజేపీని ఓడించే లక్ష్యసాధనలో నిర్వహిస్తున్న మహాధర్నాను జయప్రదం చేయాలన్నారు. పంటలన్నింటికీ సమగ్ర ఉత్పత్తి వ్యయానికి 50 శాతం కలిపి ఎంఎస్‌పీలను నిర్ణయించి చట్టబద్ధత కల్పించాలని కోరారు. రైతులు, పేదలపాలిట ఉరితాడుగా మారనున్న వ్యవసాయ మోటార్లకు ప్రీపెయిడ్ స్మార్ట్ మోటార్లను బిగించవద్దన్నారు. కౌలురైతులతో సహా రైతులందరికీ స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం పంటరుణాలు అందించాలన్నారు. రైతుల పంట రుణాల బకాయిలను ఒక పర్యాయం రద్దుచేయాలన్నారు. కేరళలో ఉన్నట్లు రైతురుణ ఉపశమన చట్టంను పార్లమెంటులో ఆమోదించి రైతుల ఆత్మహత్యలను అరికట్టాలన్నారు. నాలుగు లేబర్‌కోడ్లను రద్దుచేసి కార్మికుల హక్కులను పునరుద్ధరించాలన్నారు. పనిప్రదేశంలో సమానత్వాన్ని , భద్రతను పెంచాలని, అసంఘటిత రంగ కార్మికులను రిజిస్ట్రేషన్ చేసి వారికి పెన్షన్‌తో సహా సామాజిక భద్రత అందించాలన్నారు. భవన నిర్మాణ కార్మికులను ఈఎస్ఐలో చేర్చాలని, ఈ-శ్రమ పోర్టల్‌లో నమోదుచేసుకున్న కార్మికులందరికీ ఆరోగ్య పథకాలు, ప్రసూతి ప్రయోజనాలు, జీవిత వైకల్యబీమా అమలు చేయాలన్నారు. నూతన పెన్షన్ పద్ధతి రద్దుచేసి పాత పెన్షన్ పథకాన్ని పునరుద్ధరించాలని, కనీసవేతనం రూ.26వేలుగా నిర్ణయించి అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి పి.ఎల్.నరసింహులు, సీపీఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, ఏపీ గ్రామవార్డు సచివాలయ ఏఎన్ఎమ్స్ యూనియన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లీలావతి, సీఐటీయూ జిల్లా కార్యదర్శి రామాంజులు, ఏపీరైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వంగిమళ్లరం గారెడ్డి, ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ సురేష్, ఏఐటీయూసీ తిరుమల, సీఐటీయూ శర్మ, ప్రభాకరరెడ్డి, ఈశ్వరమ్మ, కృష్ణవేణి, అలివేలమ్మ తదితరులు పాల్గొన్నారు.